

# కేసీఆర్ జమానా.. డబుల్ ఖజానా

మొదటిపేజీ తరువాయి...


అభివృద్ధిని ప్రముఖ ఆర్థిక నిపుణులు, మార్సిలస్ వ్యవస్థాపకుడు, సీఐవో సౌరభ్ ముఖర్జియా ప్రశంసించారు. ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే రాకెట్ వేగంతో ఆర్థికాభివృద్ధి సాధించిన ప్రాంతంగా తెలంగాణను కొనియాడారు.

### అన్నింట్లోనూ నంబర్ 1

చర్చలో భాగంగా దేశ ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దక్షిణాది రాష్ట్రాల వాటా గురించి మాట్లాడిన సౌరభ్ ముఖర్జియా.. తెలంగాణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గడిచిన ఏడేండ్లలో తెలంగాణ ఆర్థికరంగం రెట్టింపు అయ్యిందని వెల్లడించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించిన ప్రాంతంగా తెలంగాణ నిలిచినట్టు కితాబిచ్చారు. ఆర్థికాభివృద్ధి రేటులో ప్రపంచంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు వివరించారు. ముఖ్యంగా పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్య, శాంతి-భద్రతలు తదితర అంశాల్లో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని తెలిపారు. అలా గడిచిన కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్నిరంగాల్లో ఎంతో వృద్ధి సాధించిందని ప్రశంసలవర్షం కురిపించారు.

### ఆర్బీఐ రాజముద్ర

*కేసీఆర్‌హయాంలో తెలంగాణ సాధించిన ఆర్థికాభివృద్ధిని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల ఓ నివేదికలో గణాంకాలతోసహా ప్రశంసించడం తెలిసిందే. తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ పదేండ్ల వ్యవధిలో 243% వృద్ధిరేటును నమోదుచేసినట్టు ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. జీఎస్డీపీలో 249% పెరుగుదల నమోదైనట్టు వివరించింది. స్థాపిత విద్యుత్తు సామర్థ్యం పెంపు, ఆహార ధాన్యాల ఉత్పత్తి, మూలధన వ్యయంలో పెరుగుదల, సాగునీటి సదుపాయం ఇలా ప్రతి అంశంలో తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించిందని ఆర్బీఐ గణాంకాలతో సహా వెల్లడించింది.*




### ఎవరీ సౌరభ్ ముఖర్జియా?



సౌరభ్ ముఖర్జియా ప్రఖ్యాత ఆర్థిక నిపుణులు. రచయిత. 1976 లో జన్మించారు. పూర్వీకులది కోల్‌కతా. స్కూల్, కళాశాల విద్య లండన్‌లోనే సౌరభ్ పూర్తయింది. ఎకనమిక్స్‌లో మాస్టర్స్ పూర్తిచేసిన సౌరభ్.. క్లియర్ క్యాపిటల్, మార్సిలస్ వంటి సక్సెస్‌ఫుల్ కంపెనీలకు వ్యవస్థాపకులుగా ఉన్నారు. ఇండియాలోని అసోసియేషన్ ఆఫ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్స్‌కు వ్యవస్థాపక డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. సెబీ, ఆర్బీఐ నిర్వహించే ఉన్నతస్థాయి సమావేశాల్లో విలువైన సూచనలిచ్చే అతికొద్ది మందిలో ఈయన కూడా ఒకరిగా చెప్తారు. ఆర్థిక సంస్కరణలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పలు పాలసీలలో కూడా ఈయన పలు సూచనలు చేశారు. 'గురూస్ కియాస్-మోడర్న్ ఇండియాస్ మనీ మాస్టర్స్', 'ది అన్‌యూజువల్ బిలియనీర్స్', 'కిస్ కంపెనీ మే ఇన్వెస్ట్ కర్నే', 'డైమండ్స్ ఇన్ ది డస్ట్', 'షేర్ మార్కెట్ కా సక్సెస్ మంత్ర' వంటి ఎన్నో పుస్తకాలు రచించారు. ఇవన్నీ బెస్ట్ సెల్లర్స్‌గా నిలిచాయి. సౌరభ్‌ను ఆయన అభిమానులు 'మనీగురు'గా పిలుస్తారు.

## రుణమాఫీ కాలేదని హైకోర్టుకు

మొదటిపేజీ తరువాయి...

తమకు రుణమాఫీ కాలేదని కోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వెల్దండ ఎస్‌బీఐలో రుణాలు తీసుకున్నామని, ప్రభుత్వం ప్రకటించిన మాఫీ తమకు వర్తించలేదని వాపోయారు. ఈ బ్యాంక్ పరిధిలో మండలంలో మొత్తం 1671 మంది రైతులకు మాఫీకాలేదని తెలిపారు. అధికారులను అడిగితే తమ తప్పు ఏమీ లేదని చెబుతున్నారని వాపోయారు. చేసేది లేక హైకోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు.

## పోలీసు బందోబస్తుతో గ్రీన్‌ఫీల్డ్ మార్కింగ్

ఆమనగల్లు, జనవరి 6: గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు రెండో విడత భూసేకరణ కోసం భారీ పోలీసు బందోబస్తు మధ్య సోమవారం మార్కింగ్ చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీని కలుపుతూ నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట నుంచి కుర్మిద్ద, కడ్తాల్, ముద్విన్, ఆమనగల్లు మీదుగా ఆకుతోటపల్లి వరకు సుమారు 21కి.మీ మేర 330 అడుగుల వెడల్పు రహదారి నిర్మాణానికి 554 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే సోమవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి శివారులో ప్రభుత్వం గుర్తించిన భూమికి రెవెన్యూ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఆ ప్రాంతంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉపకులాలకు న్యాయం కోసమే పోరాటం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

ఖైరతాబాద్, జనవరి 6 : ఎస్సీలోని ఉప కులాలకు న్యాయం చేసేందుకే 30 ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని, వర్గీకరణను వ్యతిరేకించేవారిపై తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా బీసీ నాయకులు, నిరుద్యోగ, కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణ పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిగా వర్గీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ అంశాన్ని ఆలస్యం చేస్తుందని విమర్శించారు. వర్గీకరణ సాధించుకున్నా.. రాష్ట్రంలో అమలుచేయకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. వర్గీకరణకు బీసీల మద్దతు హర్షణీయమన్నారు.




వరంగల్ జిల్లా నెక్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

# యూరియా తిప్పలేందయా!


- క్యూలో ఆధార్, పట్టాపాస్ పుస్తకాలు
- కాంగ్రెస్ హయాంలో ఇదే 'వరుస' అని ఆగ్రహం

సిరికొండ/నెక్కొండ, జనవరి 6: కాంగ్రెస్ పాలన ఏమో కానీ రైతులకు తిప్పలు మొదలయ్యాయి. ఎరువుల కోసం సొసైటీల ఎదుట ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్‌ల వరుసలు కనిపిస్తున్నాయి. చలిలో అన్నదాతలు క్యూ కడుతున్నారు. అదను ఎత్తిపోతున్నదని, యూరియా దొరకక ఏం చేయాలో అర్థమైతలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మళ్లీ ఎరువుల కోసం క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు. నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో సోమవారం పలు సొసైటీల ఎదుట కనిపించిన దృశ్యాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండ సొసైటీకి సంబంధించి చీమన్‌పల్లిలో ఉన్న సెల్ పాయింట్ వద్ద సోమవారం రైతులు బారులు తీరారు. వరంగల్ జిల్లా నెక్కొండలోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం అన్నదాతలు పడరాని పాట్లు పడ్డారు. సొసైటీ ఎదుట బారులు తీరి యూరియా కొనుగోలు చేశారు. ఫర్టిలైజర్ షాపుల్లో యూరియాను అధిక ధరకు విక్రయించడంతోపాటు డీఏపీ, ఇతర మందులు అంటగడుతున్నారని రైతులు పేర్కొన్నారు. సొసైటీల్లో ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని, మూడు బస్తాలు కావాల్సిన వారికి నానో యూరియా ఇస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కాగా, రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలున్నాయని, మంగళవారం మరో 60 టన్నుల లోడ్ తెప్పిస్తున్నట్టు స్థానిక వ్యవసాయాధికారి నాగరాజు వెల్లడించారు.

## పంట గిట్టుబాటు కాక.. రైతు భరోసా అందక..

### అప్పు తీర్చే మార్గం లేక యువరైతు ఆత్మహత్య.. భూపాలపల్లిలో ఘటన





భూపాలపల్లి రూరల్ : పంటకు గిట్టుబాటు ధర రాక.. రైతు భరోసా అందక అప్పుల పాలైన యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందిగామలో చోటు చేసుకుంది. గ్రామానికి చెంది న నీలాల శేఖర్(29) తమ 6 ఎకరాలతో పాటు రెండెకరాలు కౌలుకు తీసుకున్నా డు. రూ.10 లక్షలు అప్పు తీర్చే మార్గం లేక ఈ నెల ఒకటిన పురుగుల మందు తాగాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.



జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందచేస్తున్న వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

## మాదిగలకు 10% రిజర్వేషన్లు కేటాయించాలి

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, జనవరి 6: మాదిగలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్‌అక్తర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు కులాలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా చూడాలని, గ్రూప్-ఏ లో చేర్చాలని కమిషన్‌ను కోరారు. జస్టిస్ రామచంద్ర, జస్టిస్ ఉషామెహ్రా కమిషన్లు వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని, తాజాగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అమలు చేసుకోవచ్చని తీర్పు వెలువరించినట్టు గుర్తుచేశారు. అత్యంత వెనుకబడిన మాస్తి, డక్కలి, చెందు కులాలను ఎస్సీ-ఏ లో చేర్చాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గణేశ్, కృష్ణ, యాదగిరి, శ్రీను, వేణు, రమేశ్, శాంతికిరణ్, వెంకట్, చందు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి

- సరోద్ విద్యాంసుడు ఉస్తాద్ అంజాద్ అలీఖాన్



సంగారెడ్డి జనవరి 6(నమస్తే తెలంగాణ): మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సరోద్ విద్యాంసుడు ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో spicmacay ఆధ్వర్యంలో ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ సంగీత సభ జరిగింది. అంజాద్ అలీఖాన్ మాట్లాడుతూ తమ తల్లులను గౌరవించిన మాదిరిగానే సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళలకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి మరణ శిక్ష విధిస్తానని అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొనటం హర్షణీయమని కొనియాడారు. సంగీత విభావరిలో భాగంగా ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ తన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. మొదట ప్రముఖ తబలా వాద్యకారులు ఆదిత్య కల్యాణ్‌పూర,అమిత్ కావ్‌తేకర్ జుగల్‌బంది ఆకట్టుకుంది.

- హమాలీల కలెక్టరేట్ ముట్టడి




పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలీలు సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. సమస్యల పరిష్కారం కోసం ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడాన్ని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. -కంఠేశ్వర్

## ఏసీబీ వలలో తొర్రూరు సీఐ

### పాత కేసులో రూ.5 లక్షల డిమాండ్.. పక్కా ప్లాన్‌తో పట్టిచ్చిన బియ్యం వ్యాపారి

తొర్రూరు, జనవరి 6 : రేషన్ బియ్యం పట్టుబడిన కేసులో వ్యాపారిని తొర్రూరు సీఐ డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో 2024 అక్టోబర్ 2న రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీని విడిచిపెట్టేందుకు తొర్రూరు సీఐ జగదీశ్ బియ్యం వ్యాపారిని రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. వ్యాపారి రూ.2 లక్షలు 2024 అక్టోబర్ 3న అందజేయగా, మరో రూ. 3 లక్షల కోసం సీఐ డిమాండ్ చేయడంతో బియ్యం వ్యాపారి ఏసీబీని ఆశ్రయించగా, విచారించిన అధికారులు సీఐ జగదీశ్ అవినీతి ఆరోపణలు నిర్ధారించుకొని సీఐపై కేసు నమోదు చేసి వరంగల్‌కు తరలించారు.

# రాష్ట్రంలో ఓటర్లు 3,35,27,925

- పెరిగిన ఓటర్లు 4,90,318
- కొత్త ఓటర్లు 5,45,046
- తొలగించిన ఓట్లు 1,17,932
- పురుషుల కంటే మహిళలే అధికం
- హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 46,24,192 ఓటర్లు
- ములుగు జిల్లాలో అత్యల్పంగా 2,35,486 ఓటర్లు
- వెల్లడించిన రాష్ట్ర సీఈవో



### రాష్ట్రంలో ఓటర్ల ముఖచిత్రం

| పురుషులు | స్త్రీలు |
|---|---|
| 1,66,41,489 | 1,68,67,735 |
| ట్రాన్స్‌జెండర్లు 2,829 | సర్వీస్ ఓటర్లు 15,872 |
| **మొత్తం: 3,35,27,925** | |
| కొత్త ఓటర్లు (18 ఏండ్లు నిండినవారు) 5,45,026 | సీనియర్ సిటిజన్ ఓటర్లు (85 ఏండ్లు పైబడినవారు) 2,22,091 |
| ఓవర్సీస్ (ఎన్నారై) ఓటర్లు: 3,591 | దివ్యాంగులు 5,26,993 |

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్ల వివరాలను రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి సీ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. నిరుడు అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 28వ తేదీ వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నుంచి అందిన క్లెయిమ్స్ ఆధారంగా సోమవారం తుది జాబితాను ఆయన ప్రకటించారు. దాని ప్రకారం రాష్ట్రంలో మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. గత సంవత్సరంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య 4,90,318 పెరిగింది. కొత్తగా 5,45,046 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో పురుష ఓటర్ల కన్నా 2,26,246 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 2,19,610 మంది ఓటర్లు తమ నియోజకవర్గాలను మార్చుకున్నారు. వివిధ కారణాల వల్ల 1,17,932 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల ముఖ్య అధికారి తెలిపారు. కాగా, రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లిలో, అత్యల్ప ఓటర్లు భద్రాచలం నియోజకవర్గంలో ఉండటం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 2,829 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉండగా.. అత్యధికంగా వరంగల్ తూర్పు (341 మంది) నియోజకవర్గంలో ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఒక్క ట్రాన్స్‌జెండర్ ఓటరు నమోదు కాలేదు. భువనగిరి, దేవరకద్ర, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఒక్కరు చొప్పున ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉండగా.. మిగతా అన్ని నియోజకవర్గాల్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఉండటం విశేషం. ఇక జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 46,24,192 మంది ఓటర్లు ఉండగా.. అత్యల్పంగా ములుగులో 2,35,486 మంది ఓటర్లు నమోదయ్యారు. సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహిళా ఓటర్ల కన్నా పురుష ఓటర్లే అధికంగా ఉండటం మరో విశేషం.

### టాప్ 5 నియోజకవర్గాలు

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తుది ఓటర్ల జాబితాను అనుసరించి అత్యధిక ఓటర్లు ఉన్న టాప్ 5 నియోజకవర్గాల్లో శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, రాజేంద్రనగర్, ఎల్బీనగర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఓటర్ల సంఖ్య ఆధారంగా అత్యధికంగా ఉన్న టాప్ 5 నియోజకవర్గాలివే...



| నియోజకవర్గం | ఓటర్లు |
|---|---|
| శేరిలింగంపల్లి | 7,65,982 |
| కుత్బుల్లాపూర్ | 7,34,155 |
| మేడ్చల్ | 6,72,534 |
| రాజేంద్రనగర్ | 6,19,158 |
| ఎల్బీనగర్ | 6,06,190 |

### ఆ 4 జిల్లాల్లో పురుష ఓటర్లే అధికం

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 4 జిల్లాల్లో మినహా అన్ని జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కానీ, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో మహిళా ఓటర్ల కన్నా పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య

- ఓ ఆగంతకుడి బెదిరింపులకు భయపడి అఘాయిత్యం
- కారుపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న వైనం



ఘట్‌కేసర్, జనవరి 6 : ఓ ఆగంతకుడి బ్లాక్‌మెయిల్‌కు భయపడిన ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఘనపూర్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జమిలాపేట్‌కు చెందిన పర్వతం శ్రీరామ్(25) పోచారం మున్సిపాలిటీ నారపల్లి సమీపంలో సైకిల్ రిపేరింగ్ షాపు నడుపుతున్నాడు. అతనికి అక్కడే ఉంటున్న ఓ బాలికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయం బాలిక బంధువు, మక్త గ్రామానికి చెందిన చింటూకు తెలిసింది.అతను వారిని డబ్బులు ఇవ్వాలని, లేకుంటే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తానని బెదిరించాడు. చేసేది లేక శ్రీరామ్ తన దగ్గర ఉన్న రూ.1.35 లక్షలు, బాలిక గోల్డ్‌రింగ్ ఇచ్చారు. అయినప్పటికీ వదలకపోవడంతో ప్రేమికులిద్దరూ చనిపోదామనుకున్నారు. సోమవారం శ్రీరామ్ తన స్నేహితుడు నవీన్ కారును అడిగి తీసుకొచ్చాడు. అందులో ప్రేమికులిద్దరూ కలిసి సాయంత్రం ఘనపూర్ ఓఆర్ఆర్ వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను కారులోపల పోసి నిప్పంటించుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు

- కరోనా అంత తీవ్రమైన వ్యాధి కాదు
- సర్వసన్నద్ధంగా ఉన్నాం: హెల్త్ డైరెక్టర్
- జాగ్రతలతో సురక్షితంగా ఉండొచ్చు: సీనియర్ వైద్యుడు రాజారావు సూచన


హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎంపీవీపై ప్రజలు ఆందోళన చెందవద్దని తెలంగాణ ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ స్పష్టంచేశారు. కేంద్రం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. దవాఖానల్లో మందులు, సిబ్బంది, ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నామని తెలిపారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇది 2001లోనే వచ్చిన పాత వైరస్ అని, చలికాలంలో వైరస్‌లు విజృంభించడం సాధారణమేనని యాదాద్రి భువనగిరి జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. భారత్‌లో నాలుగు కేసులు మాత్రమే నమోదైనట్టు తెలుస్తున్నదని, ప్రజలు అనవసర భయాలు పెట్టుకోవద్దని డాక్టర్ రాజారావు వెల్లడించారు. ఈ వైరస్‌కు వ్యాక్సిన్ లేదని, లక్షణాల ఆధారంగానే చికిత్స అందిస్తారని చెప్పారు.

**హెచ్‌ఎంపీవీ వ్యాధి లక్షణాలు**

- జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధ సమస్యలు, ఒంటి నొప్పులు, గొంతు నొప్పి

- **వైరస్ వ్యాప్తి చెందే విధానం**
- తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, రోగిని తాగినప్పుడు, రోగి వస్తువులు వాడినప్పుడు

- **ఎవరిపై ప్రభావం ఎక్కువ?**
- చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రోగనిరోధకశక్తి తక్కువ ఉన్నవాళ్లపైప్రభావం ఎక్కువ



- **జాగ్రత్తలు**
- మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులను కడుక్కోవడం, లక్షణాలు కనిపిస్తే విడిగా ఉండటం, గుంపులు, రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండటం.